janodaya
# జనోదయ
WWW.JANODAYA.COM
కరీంనగర్ మంగళవారం 06.01.2026 సంపుటి:03 సంచిక:36 పేజీలు:08 వెల : 05
Karimnagar Tuesday 06.01.2026 Volume : 03 Issue : 36 Pages : 08 Cost : 05
తెలుగు దినపత్రిక

## సంక్రాంతి సెలవులు ఖరారు చేసిన ప్రభుత్వం



02

# సీఎం రేవంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి అసెంబ్లీ నుంచి జారుకొన్న బీఆర్ఎస్ నేతలు

### ఎమ్మెల్యే వివేకానంద

అబద్ధాల పునాదులపై కాంగ్రెస్ ప్రభుత్వం: వివేకానంద

పవర్ పాయింట్ ప్రజంటేషన్‌లో పచ్చి అబద్ధాలు

చెప్పారు ఎమ్మెల్యే వివేకానంద



**జనోదయ హైదరాబాద్,జనవరి 06:**

కృష్ణా జలాలపై శాసనసభలో జరిగిన చర్చ సందర్భంగా సీఎం తప్పుడు సమాచారం ఇచ్చి సభను తప్పుదోవ పట్టించారని ఆరోపిస్తూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై భారాస ఎమ్మెల్యేలు శాసనసభ కార్యదర్శి తిరుపతికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం భారాస ఎమ్మెల్యేలు వివేకానంద, కోవ లక్ష్మి, అనిల్ జాదవ్, విజయుడు శాసన సభ కార్యదర్శిని కలిసి వినతిపత్రం అందజేశారు. సీఎంపై సభా హక్కుల ఉల్లంఘన కింద చర్యలు చేపట్టాలని కోరారు.

అబద్ధాల పునాదులపై కాంగ్రెస్ ప్రభుత్వం: వివేకానంద

కాంగ్రెస్ పార్టీ అబద్ధాల పునాదులపై ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందని భారాస విప్ కేపీ వివేకానందగౌడ్ విమర్శించారు. ఆయన సోమవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ..

..మిగతా 2లో

## బంగ్లాదేశ్‌లో మరో దారుణం..
### హిందూ మహిళపై అత్యాచారం!

హిందూ వితంతువుపై ఇద్దరు వ్యక్తులు అత్యాచారం..

చెట్టుకు కట్టి జుట్టును కత్తిరించి

అమానవీయంగా చేసిన సంగటన, వీడియో రికార్డు చేసి సామాజిక మాధ్యమాల్లో వైరల్ ..



02

## క్రూజ్ బుకింగ్ పేరుతో 'ముంచేశారు'.. హైదరాబాదీకి ₹2.42 లక్షలకు టోకరా!

క్రూజ్ ట్రిప్ బుకింగ్ పేరు చెప్పి మోసం

పలు దఫాల్లో రూ.2.42 లక్షలు దోచేశారు!!




**జనోదయ హైదరాబాద్,జనవరి 06:**

: నగరానికి చెందిన ఓ వ్యక్తికి సైబర్ నేరగాళ్లు టోకరా వేశారు. క్రూజ్ ట్రిప్ బుకింగ్ పేరు చెప్పి ముంచేశారు. పలు దఫాల్లో రూ.2.42 లక్షలు దోచేశారు. చివరికి మోసపోయానని గ్రహించిన బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. సైబర్ పోలీసుల కథనం ప్రకారం.. కాచిగూడకు చెందిన ఓ వ్యక్తి గూగుల్ సెర్చ్‌లో కనిపించిన వెబ్‌సైట్ ద్వారా డిసెంబర్26న కొచ్చి లక్షద్వీప్ ముంబయికి..

..మిగతా 2లో

## చైనీస్ మాంజా వాడుతున్నారా.. సజ్జనార్ సీరియస్ వార్నింగ్

చైనీస్ మాంజా విక్రయించినా, నిల్వ చేసినా క్రిమినల్ కేసులు

ట్విట్టర్ వేదికగా సీపీ సజ్జనార్ హెచ్చరికలు జారీ

హైదరాబాద్ నగరవ్యాప్తంగా చైనీస్ మాంజాపై ప్రత్యేక నిఘా

టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులతో సంయుక్త దాడులు



02


## రిటైర్మెంట్ వయసు 64 ఏళ్లని ఎవరన్నారు?: శ్రీధర్‌బాబు

**జనోదయ హైదరాబాద్, జనవరి 06:**

అసెంబ్లీలో సోమవారం 'జీరో' అవర్‌లో భాజపా ఎమ్మెల్యే (ఆర్మూర్) పైడి రాకేశ్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల పదవీ విరమణ వయసు పెంపు ప్రచారంపై నిరుద్యోగుల్లో ఆందోళన పెరుగుతోందని దానిపై స్పష్టత ఇవ్వాలని పేర్కొన్నారు. శాసనసభ వ్యవహారాల శాఖమంత్రి శ్రీధర్‌బాబు స్పందిస్తూ..'ఉద్యోగుల రిటైర్మెంట్ వయసు 61 నుంచి 64 ఏళ్లకు పెంపు అని ఎవరన్నారు?' అని ప్రశ్నించారు. సచివాలయంలో మంత్రులు ఉండటం లేదని రాకేశ్‌రెడ్డి అనడంలో వాస్తవం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి భాజపా ప్రజాప్రతినిధులు తెలంగాణకు ఎక్కువ నిధులు ఇప్పిస్తే ఆ పార్టీ ఎమ్మెల్యేలకూ రాష్ట్ర ప్రభుత్వం అధిక నిధులు కేటాయిస్తుందని స్పష్టం చేశారు.

ఏమీ అర్థం కావట్లేదు: పైడి రాకేశ్‌రెడ్డి

అసెంబ్లీలో ప్రస్తావించిన అంశాలను నోట్ చేసుకోవడం వరకే పరిమితం అవుతున్నారని, ప్రజల సమస్యలు పరిష్కారం కావట్లేదని భాజపా ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీకి ఎందుకు వస్తున్నానో తనకు అర్థం కావడం లేదని పేర్కొన్నారు. 'ఆర్మూర్ నియోజకవర్గం నందిపేటలో బస్‌డిపో కోసం ఇంటికి రూ.5 చొప్పున ఇచ్చి ఐదున్నర ఎకరాల భూమి కొనుగోలు చేశారు. నేటికి డిపో రాలేదు. మళ్లీ నక్సలిజం వచ్చేలా చేస్తారా?' అని వ్యాఖ్యానించారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడుతూ..మేకల నుంచి రక్తం తీసి తరలిస్తున్నారని విచారణ జరిపించాలని కోరారు.





# విచారణార్హతే సమస్య

'పోలవరం-నల్లమలసాగర్'పై తెలంగాణ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌లో సుప్రీంకోర్టు వ్యాఖ్య

ఆర్టికల్ 131 కింద సివిల్ సూట్ వేసుకోవాలని సూచన

నిర్ణయం తెలిపేందుకు గడువు కోరిన తెలంగాణ తరఫు న్యాయవాది సింఘ్వీ

తదుపరి విచారణ 12వ తేదీకి వాయిదా

ఇరు రాష్ట్రాలూ మధ్యవర్తిత్వాన్ని పరిశీలించాలన్న సీజేఐ జస్టిస్ సూర్యకాంత్



**జనోదయ డిల్లీ, జనవరి 06:**

దిల్లీ: పోలవరంనల్లమలసాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి సమర్పించిన ప్రీ ఫీజిబిలిటీ రిపోర్ట్(పీఎఫ్ఆర్)కు.. కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఆమోదముద్ర వేయకముందే డీపీఆర్ తయారీ కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం టెండర్లు పిలవడాన్ని సవాల్ చేస్తూ తెలంగాణ సర్కారు దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు 12వ తేదీకి వాయిదా వేసింది. అంతర్రాష్ట్ర జల వివాదంపై తెలంగాణ ప్రభుత్వం ఆర్టికల్ 32 కింద దాఖలు చేసిన రిట్ పిటిషన్ విచారణార్హతపై సర్వోన్నత న్యాయస్థానం సందేహాలు వ్యక్తం చేసింది. దీనిపై ఆర్టికల్ 131 కింద సివిల్ సూట్ దాఖలు చేసుకోవాలని సూచించింది. ధర్మాసనం సూచనను పరిశీలించి అభిప్రాయం చెప్పడానికి గడువు ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం తరఫు న్యాయవాది అభిషేక్ సింఘ్వీ చేసిన విజ్ఞప్తి మేరకు కేసు విచారణను వాయిదా వేసింది. తెలంగాణ రిట్ పిటిషన్‌పై సోమవారం ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. తెలంగాణ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ, అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గీ, జైదీప్ గుప్తా సుదీర్ఘ వాదనలు వినిపించారు. వివాద పరిష్కారానికి మధ్యవర్తిత్వానికి వెళ్లే అంశాన్ని పరిశీలించాలని ఇరు రాష్ట్రాలకు సీజేఐ సూచించారు

ట్రైబ్యునల్ తీర్పును ఏపీ ఉల్లంఘించింది: సింఘ్వీ

అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపిస్తూ... "ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు గోదావరి ట్రైబ్యునల్ జరిపిన నీటి కేటాయింపుల్లో రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణకు 968 టీఎంసీలు, ఆంధ్రప్రదేశ్‌లోని గోదావరి పరీవాహక ప్రాంతానికి 484.5 టీఎంసీల వాటా దక్కుతుంది. ఆ తీర్పును ఆంధ్రప్రదేశ్ ఉల్లంఘించడంతోపాటు సీడబ్ల్యూసీ, జలశక్తి శాఖలు పదేపదే జారీ చేసిన ఆదేశాలను ధిక్కరిస్తూ తమకు హక్కున్న 484.5 టీఎంసీలకు మించి... వరద జలాల పేరుతో మరో 200 టీఎంసీలను అదనంగా తరలించే యత్నాలు మొదలుపెట్టింది. సీడబ్ల్యూసీ అనుమతి లేకుండానే డీపీఆర్ తయారీకి టెండర్లు పిలిచింది. సమస్యపై అధ్యయనానికి కేంద్ర ప్రభుత్వం జనవరి 2న ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేసి... 3 నెలల్లో నివేదిక సమర్పించాలని ఆదేశించింది. నివేదిక వచ్చేంతవరకైనా ఏపీ చర్యలపై స్టే విధించండి" అని కోరారు.

మా అంతర్గత అవసరాలకే ముందుగా ప్రాజెక్టు నివేదిక తయారీ: ముకుల్ రోహత్గీ

సింఘ్వీ వాదనలను ముకుల్ రోహత్గీ తోసిపుచ్చారు. "మా అంతర్గత అవసరాల కోసం మూడు నెలలు ముందుగా ప్రాజెక్టు నివేదికను తయారు చేసుకుంటే వారికి అభ్యంతరమెందుకు? కరవుపీడిత ప్రాంతాలకు వరద జలాలను తీసుకెళ్లాలనుకుంటున్నాం. మేం వాళ్ల నీటిని తీసుకోవడం లేదు. నదీ పరీవాహక ప్రాంతంలో దిగువనున్న మాకు వరద నీటిని వాడుకొనే హక్కు ఉంటుంది" అని పేర్కొన్నారు. తెలంగాణ తరఫు న్యాయవాది అభిషేక్ సింఘ్వీ కోర్టుకు సమర్పించిన నోట్ సరిగా లేదని జైదీప్ గుప్తా చెప్పారు. పోలవరం, పోలవరంనల్లమలసాగర్ ప్రాజె

02

## ఆరాటమంతా ఆధిపత్యానికే!



మన్రో సిద్ధాంతానికి పదును పెట్టిన ట్రంప్

తమ జోక్యాన్ని సమర్థించుకునేలా..

కమ్యూనిజానికి వ్యతిరేకంగా..

02

**జనోదయ డిల్లీ, జనవరి 06:**

అమెరికా ఐదో అధ్యక్షుడు జేమ్స్ మన్రో 1823లో తమ దేశ కాంగ్రెస్‌ను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో మన్రో సిద్ధాంతాన్ని సూత్రీకరించారు. దీనిద్వారా పశ్చిమార్ధగోళంలోని స్వతంత్ర దేశాల్లో ఐరోపా దేశాల జోక్యాన్ని నివారించాలన్నది ఆయన ప్రధాన ఉద్దేశం. 19వ శతాబ్దం ఆరంభం నాటికి.. చాలా లాటిన్ అమెరికా దేశాలు ఐరోపా సామ్రాజ్యాల నుంచి స్వాతంత్ర్యం సంపాదించుకున్నాయి. ఆ దేశాలపై ఐరోపా తిరిగి నియంత్రణ సాధించకుండా నిలువరించేందుకు, అదే సమయంలో పశ్చిమార్ధ గోళంలో అమెరికా ప్రాబల్యాన్ని చాటుకునేందుకు తన సిద్ధాంతం దోహదపడుతుందని మన్రో భావించారు.

తమ జోక్యాన్ని సమర్థించుకునేలా..

ప్రధానంగా పశ్చిమార్ధ గోళ దేశాల వ్యవహారాల్లో ఐరోపా జోక్యాన్ని నిలువరించేందుకు పుట్టుకొచ్చిన మన్రో సిద్ధాంతానికి.. కాలక్రమంలో పలువురు అమెరికా అధ్యక్షులు తమకు అనుకూలంగా భాష్యం చెప్పడం ప్రారంభించారు. ఇతర దేశాల్లో తమ జోక్యాన్ని సమర్థించుకునేందుకు దాన్ని వాడుకున్నారు. 1860ల్లో మెక్సికోలో మాక్సిమిలియన్ చక్రవర్తికి ఫ్రాన్స్ పాలనా పగ్గాలు ఇప్పించింది. అది మన్రో సిద్ధాంతానికి నేరుగా ఎదురైన తొలి సవాలు. అయితే అంతర్యుద్ధం తర్వాత అమెరికా ఒత్తిడికి తలొగ్గి.. మెక్సికో నుంచి ఫ్రాన్స్ తమ బలగాలను ఉపసంహరించుకుంది. అస్థిర లాటిన్ అమెరికా దేశాల్లో జోక్యం చేసుకునేందుకు అమెరికాను అనుమతించాలని 1904లో అప్పటి అమెరికా అధ్యక్షుడు థియోడర్ రూజ్‌వెల్ట్ వాదించారు. ఆ వాదనను 'రూజ్‌వెల్ట్ ఉప సిద్ధాంతం'గా పిలుస్తారు. కొలంబియా నుంచి విడిపోవడంలో పనామాకు మద్దతివ్వడం సహా చాలా వ్యవహారాల్లో వాషింగ్టన్ ఈ ఉప సిద్ధాంతాన్ని వాడుకుంది. పనామా వేర్పాటుతో అమెరికాకు పనామా కెనాల్ జోన్ దక్కింది.

కమ్యూనిజానికి వ్యతిరేకంగా.. ప్రచ్ఛన్న యుద్ధకాలంలో కమ్యూనిజానికి వ్యతిరేకంగా మన్రో సిద్ధాంతాన్ని అమెరికా ప్రయోగించింది. క్యూబా నుంచి క్షిపణులను ఉపసంహరించుకోవాలని సోవియట్ యూనియన్‌ను 1962లో అమెరికా డిమాండ్ చేయడం, నికరాగువాలో వామపక్ష సాండినిస్టా

# క్రూజ్ బుకింగ్ పేరుతో 'ముంచేశారు'..

## హైదరాబాదీకి ₹2.42 లక్షలకు టోకరా!

మొదటి పేజీ తరువాయి ...
క్రూజ్ ట్రిప్ బుక్ చేశాడు. మొత్తం నాలుగు టికెట్లకు గానూ ముందస్తు అడ్వాన్సుగా రూ.23,680 చెల్లించాడు.
ఒకేసారి అంతమొత్తం ట్రాన్స్‌ఫర్ అవ్వకపోవడంతో వివిధ దఫాల్లో చేయాలని అవతలి వ్యక్తి సూచించాడు. తర్వాత లక్షద్వీప్ పర్మిట్ లెటర్లు, పిల్లల ఛార్జీలంటూ అదనపు మొత్తాలు కట్టాలన్నారు. సాంకేతిక కారణాలు ఉన్నాయని, మీరు చెల్లించిన మొత్తం చెక్‌అవుట్ సమయంలో రిఫండ్ చేస్తామంటూ మళ్లీ మళ్లీ పేమెంట్లు చేయించారు. కారణం చెప్పకుండా బుకింగ్ క్యాన్సిల్ చేయడంతో పాటు, క్యాన్సిలేషన్ ఛార్జీ కింద మరో రూ.48,500 కట్టాలని డిమాండ్ చేశారు. మొత్తం రిఫండ్ చేస్తామని నమ్మబలికారు. మొత్తంగా రూ.2.42 లక్షలు వివిధ దఫాల్లో వసూలు చేశారు. చివరికి మోసపోయానని గ్రహించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సదరు కంపెనీ కస్టమర్ కేర్ ప్రతినిధిగా ఓ వ్యక్తి వాట్సప్ ద్వారా తనను సంప్రదించినట్లు బాధితుడు పేర్కొన్నాడు. ఈ తరహా ఘటనలపై పౌరులకు అవగాహన కల్పించడం కోసం డిప్యూటీ కమిషనర్ (సైబర్ క్రైమ్స్) ఓ అడ్వైజరీని జారీ చేశారు.

ఈ జాగ్రత్తలు తీసుకోండి..

- పర్యాటక ప్యాకేజీలను ఎప్పుడూ అధికారిక వెబ్‌సైట్ లేదా ఆథరైజ్డ్ ఏజెంట్ల ద్వారానే బుక్ చేయండి.
- గూగుల్ సెర్చ్ లేదా అడ్వర్టైజ్‌మెంట్లలో కనిపించే సైట్లను నమ్మి పేమెంట్లు చేయొద్దు.
- సాంకేతిక సమస్యలు, పేమెంట్ ఫెయిల్యూర్ల పేరుతో డబ్బులు డిమాండ్ చేస్తే అనుమానించండి.
- అధికారిక వెబ్‌సైట్‌లో ఉండే కస్టమర్ కేర్ నంబర్లనే నమ్మండి.. వాట్సప్‌లో సంప్రదించేవారిని విశ్వసించొద్దు.
- సైబర్ మోసాలు జరిగితే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయండి. లేదా www.cybercrime.gov.inలో ఫిర్యాదు చేయండి.
- సైబర్ నేరాలకు సంబంధించి అత్యవసర సందర్భాల్లో 87126 65171కు కాల్ లేదా వాట్సప్ చేయండి.




# సంక్రాంతి సెలవులు ఖరారు చేసిన ప్రభుత్వం

**జనోదయ | హైదరాబాద్ | జనవరి 05:** రాష్ట్రంలోని అన్ని పాఠశాలలకు సంక్రాంతి సెలవులను ప్రభుత్వం ప్రకటించింది. జనవరి 10 నుండి జనవరి 16 వరకు సంక్రాంతి సెలవులు అమల్లో ఉంటాయని స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నవీన్ నికోలస్ ఉత్తర్వులు జారీ చేశారు.

రాష్ట్రంలోని అన్ని పాఠశాలలకు సంక్రాంతి సెలవులను ప్రభుత్వం ప్రకటించింది. జనవరి 10 నుండి జనవరి 16 వరకు సంక్రాంతి సెలవులు అమల్లో ఉంటాయని స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నవీన్ నికోలస్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన సెలవుల జాబితా ప్రకారం జనవరి 15న సంక్రాంతి పండుగ ఉండగా, జనవరి 16న కనుమను ఆప్షనల్ హాలిడేగా పేర్కొన్నారు. సెలవుల అనంతరం రాష్ట్రంలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలు జనవరి 17న తిరిగి ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ మేరకు తదుపరి చర్యలు తీసుకోవాలని హైదరాబాద్, వరంగల్ ప్రాంతీయ డైరెక్టర్లతో పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల విద్యాశాఖాధికారులను విద్యాశాఖ ఆదేశించింది. 202526 విద్యా సంవత్సరం క్యాలెండర్ ను అనుసరించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది.



# బంగ్లాదేశ్‌లో మరో దారుణం.. హిందూ మహిళపై అత్యాచారం!

**జనోదయ, హైదరాబాద్ జనవరి 5:** పొరుగుదేశం బంగ్లాదేశ్‌లో మరో దారుణం చోటుచేసుకుంది. హిందూ వితంతువుపై ఇద్దరు వ్యక్తులు అత్యాచారానికి పాల్పడ్డారు. ఆమె నుంచి డబ్బులు డిమాండ్ చేయడంతో పాటు.. చెట్టుకు కట్టి జుట్టును కత్తిరించి అమానవీయంగా వ్యవహరించారు. ఈ దారుణ ఘటన కలిగంజ్‌లో చోటుచేసుకుంది. ఈ మేరకు బాధిత మహిళ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రెండున్నరేళ్ల క్రితం షహిన్, అతడి తమ్ముడి వద్ద బాధిత మహిళ కొంత భూమిని, ఇంటిని కొనుగోలు చేసింది. అప్పటి నుంచి షహిన్ ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ వేధింపులకు గురి చేస్తున్నాడు. శనివారం సాయంత్రం బాధిత మహిళ ఇంటికి బంధువులు వచ్చారు. అదే సమయంలో షహిన్, అతడి అనుచరుడు హసన్ ఇంట్లోకి చొరబడ్డారు. బంధువులను తరిమికొట్టి ఆమెపై అత్యాచారానికి పాల్పడ్డారు. అంతటితో ఆగకుండా ఆమె నుంచి డబ్బులు డిమాండ్ చేశారు. అందుకు ఆమె నిరాకరించడంతో ఆమెను చెట్టుకు కట్టేసి జుట్టు కత్తిరించారు.

ఈ మొత్తం ఉదంతాన్ని వారు వీడియో రికార్డు చేసి సామాజిక మాధ్యమాల్లో ఉంచారు. తీవ్రంగా గాయపడి స్పృహ కోల్పోయిన ఆమెను స్థానికులు ఆస్పత్రిలో చేర్పించారు. అనంతరం కలిగంజ్ ఆస్పత్రిలో ఇరువురిపై బాధితురాలు ఫిర్యాదు చేశారు. నిందితులపై చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. బంగ్లాదేశ్‌లో ఇటీవల కాలంలో ఈ తరహా నేరాలు వరుసగా జరుగుతున్నాయి. మైనారిటీలే లక్ష్యంగా ఈ దాడులు కొనసాగుతున్నా యూనస్ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది.



# చైనీస్ మాంజా వాడుతున్నారా.. సజ్జనార్ సీరియస్ వార్నింగ్

**జనోదయ, హైదరాబాద్ జనవరి 5:** తెలుగు రాష్ట్రాల్లో సంకాంత్రి అనగానే కోడి పందాలు, గొబ్బెమ్మలు, ముగ్గులు, పంతగులు గుర్తుకు వస్తాయి. హైదరాబాద్‌లో ప్రత్యేకంగా తయారు చేసిన పంతగులను(కైట్స్) ఎగురవేస్తారు. అయితే, కైట్స్ కోసం వాడే చైనీస్ మాంజా వినియోగంపై నగర సీపీ వీసీ సజ్జనార్ హెచ్చరికలు జారీ చేశారు. చైనీస్ మాంజా విక్రయించినా, నిల్వ చేసినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. హైదరాబాద్ సీపీ సజ్జనార్ తాజాగా ట్విట్టర్ వేదికగా.. హైదరాబాద్ నగర వ్యాప్తంగా చైనీస్ మాంజాపై ప్రత్యేక నిఘా ఉంది. మాంజా విక్రయించినా, నిల్వ చేసినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులతో సంయుక్త దాడులు చేస్తున్నాం. కైట్స్ షాపులు, గోదాములపై ఆకస్మిక తనిఖీలు చేస్తున్నాం. అక్రమ రవాణాపై ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీలపై కూడా కేసులు పెడుతున్నాం. చైనీస్ మాంజాతో ప్రాణాపాయం. అందుకే అందరినీ హెచ్చరిస్తున్నాం. మాంజా వినియోగంపై సమాచారం ఇస్తే వారి వివరాలను గోప్యతగా ఉంచుతాం. డయల్ 100/ పోలీస్ వాట్సాప్ నంబర్ 94906 165559కు ఫిర్యాదు చేయవచ్చు అని తెలిపారు.




# సీఎం రేవంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి

మొదటి పేజీ తరువాయి..
అబద్ధాల పునాదులపై కాంగ్రెస్ ప్రభుత్వం: వివేకానంద

కాంగ్రెస్ పార్టీ అబద్ధాల పునాదులపై ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందని భారాస విప్ కేపీ వివేకానంద గౌడ్ విమర్శించారు. ఆయన సోమవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ.. 'పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుపై చర్చ సందర్భంగా దేవుడిపై సీఎం ఒట్టేశారు. సభలో పవర్ పాయింట్ ప్రజజంటేషన్‌లో పచ్చి అబద్ధాలు చెప్పారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను తానే ఆపానని రేవంత్‌రెడ్డి అసత్యాలు మాట్లాడారు. సీఎం అసెంబ్లీలో తప్పులు మాట్లాడారని ఏపీ ప్రభుత్వం కూడా అంటోంది. ఎపెక్స్ కౌన్సిల్‌లో ఉన్న అంశాలను తప్పుదోవ పట్టించారు. కృష్ణా నదీజలాలపై శాశ్వత ఒప్పందం అన్నట్లుగా ప్రజలను, సభను నమ్మించే విధంగా సీఎం మాట్లాడారు. ముఖ్యమంత్రిపై ఇచ్చిన సభా హక్కుల ఉల్లంఘన నోటీసును స్పీకర్ అంగీకరించాలని కోరుతున్నాం. అసెంబ్లీలో మా పీపీటీకి అవకాశమివ్వాలని అడగడం తప్పెలా అవుతుంది?' అని వివేకానంద పేర్కొన్నారు.



# విచారణార్హతే సమస్య

మొదటి పేజీ తరువాయి..
క్టులు వేర్వేరని, కానీ రెండింటినీ కలిపి చూపుతున్నారన్నారు. ఈ అంశం సీడబ్ల్యూసీ పరిశీలనలో ఉందని, దానికి ఆమోదముద్ర వేసేంతవరకూ డీపీఆర్ సమర్పించలేమన్నారు. ఏపీ దరఖాస్తును సీడబ్ల్యూసీ తిరస్కరించిందని తెలంగాణ అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి చెప్పగా... అది అవాస్తవమని జైదీప్ గుప్తా పేర్కొన్నారు.

కేంద్రం ఏర్పాటు చేసిన కమిటీకీ సమస్యలు చెప్పుకోవచ్చు: సీజేఐ


అంతర్రాష్ట్ర జలవివాదానికి సంబంధించిన కేసులో తెలంగాణ ప్రభుత్వం ఆర్టికల్ 32 కింద రిట్ పిటిషన్ దాఖలు చేయడాన్ని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ప్రశ్నించారు. "ఒకటికి మించిన రాష్ట్రాలు, కేంద్ర ప్రభుత్వం మధ్య వివాదాలు తలెత్తినప్పుడు సర్వోన్నత న్యాయస్థానాన్ని ఎలా ఆశ్రయించాలో రాజ్యాంగం చెబుతోంది. అందువల్ల రిట్ పిటిషన్ దాఖలు చేయొచ్చా? లేదా సూట్ దాఖలు చేయాలా? అన్న విషయాన్ని మాత్రమే పరిశీలిస్తున్నాం. ఇలాంటి అంశాల్లో ఆర్టికల్ 32 కింద దాఖలు చేసిన పిటిషన్‌కు విచారణార్హతే పెద్ద సమస్య. దానికి బదులు ఆర్టికల్ 131 కింద సివిల్ సూట్ దాఖలు చేసుకోండి. గోదావరి ట్రైబ్యునల్ తెలంగాణకు కేటాయించిన నీటి వాటాలకు ఇబ్బంది కలిగించకుండా, భవిష్యత్తులో ఎలాంటి అదనపు హక్కులు కోరబోమని చెప్పి ఆంధ్రప్రదేశ్ కొత్త కాలువ నిర్మించుకుంటే ఏమవుతుంది? ఏపీ తలపెట్టిన కొత్త కాలువ నిర్మాణం కారణంగా తమ వాటా తగ్గిపోయే అవకాశం ఉందని తెలంగాణ వాదిస్తోంది. పోలవరం జాతీయ ప్రాజెక్టు. కేంద్ర ప్రభుత్వ ముందస్తు అనుమతి లేకుండా అందులో మార్పులు, చేర్పులు చేయలేరు కదా" అని జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. సింఘ్వీ స్పందిస్తూ... "ఈ ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని పనులనూ నిలిపివేయాలంటూ ఆంధ్రప్రదేశ్‌కు సీడబ్ల్యూసీ చెప్పినా ఆపకపోవడం వల్లే అత్యవసర పరిస్థితుల్లో ఆర్టికల్ 32 కింద ఈ కోర్టును ఆశ్రయించాం. మేం దాఖలు చేసిన రిట్ పిటిషన్‌లో కేంద్ర ప్రభుత్వం, సీడబ్ల్యూసీ ప్రతివాదులుగా ఉన్నాయి. సివిల్ సూట్ దాఖలు చేస్తే... రాష్ట్రాలకు సంబంధించిన విషయంలో మమ్మల్ని ఎలా పార్టీ చేశారని కేంద్ర ప్రభుత్వం ప్రశ్నించొచ్చు. ఇప్పుడు మాకు మధ్యంతర రక్షణ కల్పిస్తే... సివిల్ సూట్ దాఖలు చేసే అంశాన్ని పరిశీలిస్తాం. ఈ విషయంలో ఎలాంటి అభిప్రాయాలు వ్యక్తం చేయకుండా కేసు విచారణను వచ్చే వారానికి వాయిదా వేయండి. ఆలోపు మేం ఒక నిర్ణయానికి వస్తాం" అని ధర్మాసనానికి సింఘ్వీ విజ్ఞప్తి చేశారు. దీంతో కేసు విచారణను వచ్చే సోమవారానికి వాయిదా వేస్తున్నట్లు సీజేఐ ప్రకటించారు. అదే సమయంలో వివాద పరిష్కారానికి ఇరు రాష్ట్రాలూ మధ్యవర్తిత్వం గురించి ఎందుకు ఆలోచించకూడదని ఆయన సూచించారు. ఏపీ చర్యతో పరీవాహక ప్రాంతాలన్నింటిపైనా ప్రభావం.

# ఆరాటమంతా ఆధిపత్యానికే!

. అది మన్రో సిద్ధాంతానికి నేరుగా ఎదురైన తొలి సవాలు. అయితే అంతర్యుద్ధం తర్వాత అమెరికా ఒత్తిడికి తలొగ్గి.. మెక్సికో నుంచి ఫ్రాన్స్ తమ బలగాలను ఉపసంహరించుకుంది. అస్థిర లాటిన్ అమెరికా దేశాల్లో జోక్యం చేసుకునేందుకు అమెరికాను అనుమతించాలని 1904లో అప్పటి అమెరికా అధ్యక్షుడు థియోడర్ రూజ్‌వెల్ట్ వాదించారు. ఆ వాదనను 'రూజ్‌వెల్ట్ ఉప సిద్ధాంతం'గా పిలుస్తారు. కొలంబియా నుంచి విడిపోవడంలో పనామాకు మద్దతివ్వడం సహా చాలా వ్యవహారాల్లో వాషింగ్టన్ ఈ ఉప సిద్ధాంతాన్ని వాడుకుంది. పనామా వేర్పాటుతో అమెరికాకు పనామా కెనాల్ జోన్ దక్కింది.

కమ్యూనిజానికి వ్యతిరేకంగా..

ప్రచ్ఛన్న యుద్ధకాలంలో కమ్యూనిజానికి వ్యతిరేకంగా మన్రో సిద్ధాంతాన్ని అమెరికా ప్రయోగించింది. క్యూబా నుంచి క్షిపణులను ఉపసంహరించుకోవాలని సోవియట్ యూనియన్‌ను 1962లో అమెరికా డిమాండ్ చేయడం, నికరాగువాలో వామపక్ష సాండినిస్టా ప్రభుత్వాన్ని రీగన్ ప్రభుత్వం వ్యతిరేకించడం వంటివి ఇందుకు ఉదాహరణలు. అమెరికా తన వాణిజ్య, వ్యూహాత్మక ప్రయోజనాల కోసం మన్రో సిద్ధాంతానికి ఎప్ప



# నగునూరులో MGNREGS నిధుల దుర్వినియోగంపై కలెక్టర్‌కు ఫిర్యాదు

**జనోదయ జనవరి 5 కరీంనగర్ :** నగునూరు గ్రామ అభివృద్ధి కోసం మంజూరైన మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం (MGNREGS) నిధులలో భాగంగా రూ.50,00,000/ (యాభది లక్షల రూపాయలు) ప్రజల సౌకర్యార్థం వినియోగించాల్సి ఉండగా, ఆ నిధులను దుర్వినియోగం చేశారంటూ ఆరోపణలు వెల్లువెత్తాయి. నగునూరు గ్రామంలో వేయాల్సిన సీసీ రోడ్డు మరియు డ్రైనేజీ పనులను 1వ (ప్రస్తుత 2వ) డివిజన్ మాజీ బీజేపీ కార్పోరేటర్ కొలగాని శ్రీనివాస్ (తండ్రి: రాజయ్య), నివాసం తీగలగుట్టపల్లి, కరీంనగర్‌కు చెందిన వ్యక్తి తన స్వంత ఫామ్ హౌజ్ మరియు వ్యవసాయ భూముల ప్రయోజనాల కోసం వినియోగించుకున్నారని గ్రామస్తులు ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డ వారితో పాటు రోడ్డు పనులు చేపట్టిన కాంట్రాక్టర్లపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ నగునూరు గ్రామ వాస్తవ్యులు, మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షులు సాయిల్ల రాజు, మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కొత్తకొండ కొమురయ్య, గ్రామ శాఖ అధ్యక్షులు తాళ్లపెల్లి శేఖర్ గౌడ్, బండివెల్లి ప్రవీణ్ కుమార్ తదితరులు నేడు ప్రజావాణి కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా కలెక్టర్‌కు రాసిన ఫిర్యాదు లేఖను అదనపు కలెక్టర్‌కు అందజేశారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం కాకుండా కాపాడి, బాధ్యులపై తగు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.



# గంగాధరలో రోడ్డు ప్రమాదం: నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తి మృతి

**జనోదయ | గంగాధర | జనవరి 05:** గంగాధర మండలంలో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే, తేదీ 04/01/2026 సాయంత్రం సుమారు 6:30 గంటల సమయంలో గంగాధర మండలం గోపాలరావుపల్లికి చెందిన అమ్ముల విజేందర్ (తండ్రి: బాలయ్య, వయస్సు 46 సంవత్సరాలు) మధుర నగర్‌లోని తన నివాసం నుంచి గంగాధర ఎక్స్ రోడ్ వైపు నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో బోయినపల్లి నుంచి గంగాధర ఎక్స్ రోడ్ దిశగా వెళ్తున్న AP 15 BJ 2518 నంబర్ గల బైక్‌ను అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ వచ్చిన శివరాత్రి నవీన్ వెనుక నుంచి విజేందర్‌ను ఢీకొట్టాడు.

ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన విజేందర్ కింద పడిపోయి, అతని కాలు, చేతులు, ముక్కు భాగాల నుంచి రక్తస్రావం జరిగింది. వెంటనే స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. అదే ప్రమాదంలో బైక్ నడిపిన శివరాత్రి నవీన్‌కు కూడా తీవ్ర గాయాలు కాగా, ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గంగాధర ఎస్సై వంశీకృష్ణ తెలిపారు.



# మోసం చేసి తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వాలని ఆందోళన

- దేవాపూర్ లో సీపతి రంజిత్ కుమార్ ఇంటి ముందు టెంట్ వేసి బాధితుల ధర్నా



**జనోదయ, బెల్లంపల్లి,జనవరి 5 :** భూమి ఇస్తామని చెప్పి మోసం చేసి తీసుకున్న రూ.20 లక్షల డబ్బులు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేసూ సోమవారం కాసిపేట మండలంలోని దేవాపూర్ లో సీపతి రంజిత్ కుమార్ అనే వ్యక్తి ఇంటి ముందు మంచిర్యాల ఎంసీసీ శ్రీనివాస కాలనీకి చెందిన చీపిరిశెట్టి సుధాకర్ తన కుటుంబంతో ఆందోళనకు దిగారు. డబ్బులు తీసుకున్న సీపతి రంజిత్ కుమార్ ఇంటి ముందు కుటుంబంతో సహా టెంట్ వేసి మరీ బైఠాయించి ధర్నాకు దిగారు. 2020లో సీపతి రంజిత్ కుమార్ భూమి అమ్ముతామని చెప్పి రూ.20 లక్షలు తీసుకొని మోసం చేశాడన్నారు. డబ్బులు తిరిగి ఇవ్వాలని అడగగా ఇవ్వకుండా తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారన్నారు. మా కుటుంబం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నామని, డబ్బులు ఇచ్చే వరకు తిరిగి వెళ్లమని బాధిత కుటుంబీకులు సీపతి రంజిత్ కుమార్ ఇంటి ముందు బైఠాయించి ఆందోళన చేపట్టారు. తమకు న్యాయం జరిగే వరకు ఆందోళన విరమించమని స్పష్టం చేశారు. దీంతో పోలీసులు చేరుకొని పోలీస్ స్టేషన్కు ఇరువురిని పిలిపించి మాట్లాడుతామని అప్పటి వరకు ఆందోళన విరమించాలని చెప్పడంతో ఆందోళన విరమించారు. అనంతరం బాధిత కుటుంబీకులు చీపిరిశెట్టి సుధాకర్, అనసూర్యలు మాట్లాడుతూ 2020లో శ్రీనివాస గార్డెన్ వద్ద భూమి ఉందని, భూమి అమ్ముతామని చెప్పి రూ.20 లక్షలు దేవాపూర్ కు చెందిన సీపతి రంజిత్ కుమార్ తీసుకున్నట్లు తెలిపారు. డబ్బులు ఇచ్చి రాయించుకున్న పత్రాలు, తిరిగి ఇస్తామని రాసి ఇచ్చిన మొత్తం పత్రాలను, ఒప్పంద పత్రాలు సాక్షాలతో సహా చూపించారు. సింగరేణిలో పదవి విరమణ పొందగా వచ్చిన డబ్బులను మొత్తం పిల్లల భవిష్యత్తు కోసం భూమి కొనుగోలు చేసేందుకు సీపతి రంజిత్ కుమార్ కు అందించినట్లు తెలిపారు. కాని భూమి ఇవ్వకుండా తిప్పించుకుంటున్నారని, తర్వాత మోసపోయామని గ్రహించినట్లు తెలిపారు. ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వాలని చెప్పగా అసలు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు, అధికారులు తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో బాధిత కుటుంబీకులు కొండ వెంకటేష్, శృతి పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇంటి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- చిర్రకుంట సర్పంచ్ శ్రీలత

**జనోదయ, మందమర్రి జనవరి 5:** ఇందిరమ్మ ఇంటి పథకాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకొని ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని చిర్రకుంట గ్రామ సర్పంచ్ శ్రీలత తిరుపతి కోరారు. గ్రామంలో చేపట్టిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను సోమవారం ఇందిరమ్మ కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామం లోని ఇళ్లు లేని నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ పథకం ద్వారా ఇంటి నిర్మాణానికి కృషి చేస్తుందని, దీనిని అర్హులైన ప్రతి లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ జోత్స్నా, గ్రామ కార్యదర్శి రమేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గందే రామచందర్, మాజీ సర్పంచ్ ఒడ్నాల కొమురయ్య, కాంగ్రెస్ నాయకులు రామటెంకీ తిరుపతి, లబ్ధిదారులు పాల్గొన్నారు



# రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం

**జనోదయ,పెద్దపల్లి ప్రతినిది జనవరి 5:** రోడ్డు భద్రతపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించాలనే లక్ష్యంతో పెద్దపల్లి జిల్లా ట్రాఫిక్ విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా రంగంపల్లి ప్రాంతంలోని మైనారిటీ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజ్‌లో "అరైవ్ అలైవ్" అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అనిల్ కుమార్ నాయకత్వం వహించారు. కార్యక్రమంలో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రతా చర్యలు, సురక్షిత ప్రయాణ విధానాలపై సమగ్రంగా వివరించారు. వేగంగా వాహనాలు నడపడం, మైనర్ డ్రైవింగ్, రాంగ్ రూట్‌లో ప్రయాణం, ట్రిపుల్ రైడింగ్ వంటి చర్యలు చట్టరీత్యా నేరాలని స్పష్టంగా తెలియజేశారు. హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పనిసరి వినియోగం ఎంత ముఖ్యమో ఉదాహరణలతో వివరించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కలిగే ప్రాణనష్టం, కుటుంబాలపై పడే ప్రభావాన్ని విద్యార్థులకు అవగాహన కల్పించారు. చిన్న వయసు నుంచే రోడ్డు భద్రతపై అవగాహన ఉంటే భవిష్యత్తులో ప్రమాదాలను తగ్గించవచ్చని అనిల్ కుమార్ పేర్కొన్నారు. విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలను స్వయంగా పాటించడమే కాకుండా తమ కుటుంబ సభ్యులకు కూడా తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ అనిల్, ఎస్ఐ రవీందర్, కాలేజ్ ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి పాల్గొని విద్యార్థులను చైతన్యపరిచారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యతనే సందేశం ఈ కార్యక్రమం ద్వారా స్పష్టమైంది.



# మానవత్వానికి నిదర్శనంగా యువత చేయూత

**జనోదయ,పెద్దపల్లి/రామగిరి జనవరి 5:** పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం ముస్త్యాల గ్రామంలో ఇటీవల మృతి చెందిన గోసిక సురేష్ కుటుంబాన్ని గ్రామ యువత పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. యువ నాయకుడు కొమిరినేని మనోహర్ రావు నేతృత్వంలో ఏర్పాటైన "ముస్త్యాల చేయూత" గ్రూప్ సభ్యుల సహకారంతో బాధిత కుటుంబానికి 35 వేల రూపాయలు అందించారు. కష్టకాలంలో ఒకరికొకరు అండగా నిలవడమే లక్ష్యంగా ఈ సహాయం చేసినట్లు తెలిపారు. గ్రామ యువత చూపిన ఐక్యత, మానవత్వం అందరికీ ఆదర్శంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో జంబోజ రాజేందర్, బెల్లంకొండ కనకయ్య, సిద్ధ శేఖర్, సుందిళ్ళ కృష్ణ, బెల్లంకొండ ప్రసాద్, బొంతల శ్రావణ్, జక్కుల రక్షిత్, కాల్వల సాయి, ఉదురుకోట కుమార్, గుర్రం మహేష్, మెరుగు మల్లేష్, బుపెల్లి ప్రేమ్, కొమిరినేని సాయి, ఎల్లోల మల్లేష్, జనగాం అనిల్ రమేష్ తదితరులు పాల్గొన్నారు. గ్రామ యువత చూపిన ఈ సహాయ కార్యక్రమం మానవత్వానికి నిలువెత్తు ఉదాహరణగా నిలిచింది.



# భాస్వరం ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన

**జనోదయ, మందమర్రి జనవరి 5:** రైతులు తమ పంటలకు వివిధ రూపాలలో అందిస్తున్న భాస్వరం ఎరువులు, పంట పూర్తి స్థాయిలో వినియోగించుకునేలా భాస్వరం కరిగించు బాక్టీరియా తోడ్పడుతుందని మండల వ్యవసాయ విస్తరణ అధికారి ముత్యం తిరుపతి అన్నారు. మండలం లోని గుడిపల్లి గ్రామంలో రైతులకు భాస్వరం కరుగదీయు బాక్టీరియా వినియోగించు విధానంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భాస్వరం కరిగించు బాక్టీరియా ని 3 కిలోలు, బాగా మాగిన 100 కిలోల పశువుల పేడకు పట్టించి ఒక ఎకరా పొలంలో చల్లడం ద్వారా పంటకు అందించిన భాస్వరం ఎరువులు సమర్ధ వినియోగం జరిగి పంటలలో అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. నేలలో నిక్షిప్తం అయిన భాస్వరాన్ని పూర్తి స్థాయిలో వినియోగించడం ద్వారా భూమిని చౌడు బారకుండా కాపాడవచ్చన్నారు. అనంతరం నేలకు భాస్వరం కరిగించు బాక్టీరియా, పశువుల పేడ మిశ్రమాన్ని తయారు చేసుకొనే విధానాన్నీ తయారు చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు పాల్గొన్నారు.





# అరుణాచలం,సింహాచలం తరహాలో కొండగట్టు గిరిప్రదక్షిణ ఏర్పాట్లకు ప్రణాళిక రూపకల్పన

## జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

**జనోదయ,జగిత్యాల ప్రతినిధి,జనవరి 05:** జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేట గ్రామంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి ఆలయం ప్రాంతంలో భక్తులు గిరిప్రదక్షిణ చేయడానికి జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సోమవారం కొండగట్టు లోని రోడ్డు మార్గాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..

కొండగట్టు ఆలయం చుట్టూ భక్తులు గిరిప్రదక్షిణ చేయడానికి కావాల్సిన ఏర్పాట్ల గురించి రెవిన్యూ, ఫారెస్ట్, ఆర్ & బి, పంచాయతీ రాజ్ మరియు సంబంధిత అధికారులతో పరిశీలించడం జరిగిందని తెలిపారు. గిరిప్రదక్షిణ కొరకు ముఖ్యంగా రోడ్డు విస్తారంగా ఉండాలని మార్గ మధ్యలో భక్తులకు త్రాగు నీరు, శౌచాలయాలు, విశ్రాంత కేంద్రాలు మరియు తదితర అంశాల గురించి సంబంధిత అధికారులకు సూచించడం జరిగిందని తెలిపారు.

అలాగే గిరిప్రదక్షిణ కొరకు అంచనా ప్రణాళికలు రూపొందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అరుణాచలం, సింహాచలం తరహాలో గిరి ప్రదక్షిణ ఏర్పాట్ల కు ప్రణాళిక చేయాలని ప్రభుత్వం ఆదేశించిందని తెలిపారు.ఇందుకుగాను దాదాపు 40 ఫీట్ల రోడ్డు వెడల్పు పనులు, విద్యుత్ దీపాలు, అటవీ శాఖ అనుమతుల గురించి మరియు పనుల అంచనా వ్యయాల గురించి ప్రభుత్వానికి నివేదించనున్నట్లు తెలిపారు. ఈ పరిశీలనలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) బి. రాజ గౌడ్, జిల్లా అటవీ శాఖ అధికారి మాదాసు రవి ప్రసాద్, జగిత్యాల ఆర్డీవో మధు సూదన్, కొండగట్టు ఈ.వో శ్రీకాంత్ రావు, సంబంధిత అధికారుల, తదితరులు పాల్గొన్నారు.

# వివేకానంద విద్యాలయ విద్యార్థులకు రంగోత్సవ్ అవార్డులు



**జనోదయ గంగాధర జనవరి 05:** గంగాధర మండల కేంద్రంలోని వివేకానంద విద్యాలయంలో జాతీయ స్థాయిలో నిర్వహించిన రంగోత్సవ్ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో జాతీయ స్థాయిలో మొదటి, నాలుగవ బహుమతులతో పాటు మొత్తం 136 మంది విద్యార్థులు బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో అవార్డుల బహుకరణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ స్రవంతి, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ హరిత పాల్గొని రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ పడాల భాగ్యలక్ష్మి-రాజన్న, ఉపసర్పంచ్ శ్రీనివాస్, పాఠశాల డైరెక్టర్ ఆనంద్ రెడ్డి, ప్రిన్సిపాల్ లక్ష్మారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ప్రజా ప్రతినిధులకు సన్మానం

**జనోదయ, జగిత్యాల,మేడిపల్లి, జనవరి 05:** స్థానిక సంస్థల ఎన్నికలలో సర్పంచ్ ఉప సర్పంచ్ లుగా ఎన్నికైన మేడిపల్లి మండలం తొంభరావుపేట సర్పంచ్ నల్ల గంగారెడ్డి,భీమారం మండలం లింగంపేట సర్పంచ్ వెల్మ సుప్రియ హరీష్ రెడ్డి ఇతర ప్రజాప్రతినిధులను ఉమ్మడి మేడిపల్లి మండల రెడ్డి జన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.. గ్రామాలను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లి ప్రజల మన్ననలు పొందాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో ఉమ్మడి మేడిపల్లి మండల రెడ్డి జన సంక్షేమ సంఘం అధ్యక్షులు నోముల నరసింహారెడ్డి,ప్రధాన కార్యదర్శి మిట్టపల్లి రాజారెడ్డి,కోశాధికారి కాలగిరి రాజేందర్ రెడ్డి,మాజీ అధ్యక్షులు ఏనుగు రమేష్ రెడ్డి,కొప్పెర లింగారెడ్డి, మండల కార్యవర్గ సభ్యులు, మేడిపల్లి,భీమారం మండలాలకు చెందిన ఆయా గ్రామాల రెడ్డి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



# జీడీకే11 ఇన్ క్లైన్ గనిని సందర్శించిన పెద్దపల్లి ఎంపీ



జనోదయ, గోదావరిఖని, డిసెంబర్ 05 : పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ సోమవారం సింగరేణి రామగుండం1 డివిజన్ లోని జీడీకే 11 ఇంక్లైన్ గనిని సందర్శించారు. ఈ మేరకు ఎంపీకి ఆర్జీ 1 జీఎం లలిత్ కుమార్, సింగరేణి అధికారులు ఘన స్వాగతం పలికారు. ఇందులో భాగంగా బొగ్గు గని లోనికి(అండర్ గ్రౌండ్) వెళ్లి పని స్థలాలను పరిశీలించారు. గని ఆవరణలోని దుర్గాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్మికులను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సింగరేణిలో నెలకొన్న సమస్యలపై కార్మికులు ఎంపీ దృష్టికీ తీసుకెళ్లారు. సింగరేణి కార్మికులకు సింగరేణి కార్మికులకు ఆదాయ పన్ను మినహాయింపు, మెడికల్ బోర్డు ఏర్పాటు పై ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి తో ఇప్పటికే మాట్లాడడం జరిగింది, మరో మారు వారి దృష్టికి తీసుకువెళ్తానని ఎంపి తెలిపారు. సింగరేణి విశ్రాంతి కార్మికులకు పదివేల రూపాయల పెన్షన్ వచ్చేలా పార్లమెంటులో ప్రస్తావించడం జరిగిందని, ఈ విషయంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ సీతారామన్ దృష్టికి తీసుకెళ్లానని, పార్లమెంట్లో అవకాశం వచ్చినప్పుడు సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై మాట్లాడటం జరుగుతుందని, కార్మికుల సొంతింటి కల నెరవేరేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు వస్తానని, మారుపేరుల సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని ఎంపీ కార్మికులకు చెప్పారు. ముఖ్యంగా మహిళ కార్మికుల ఎలాంటి సమస్యలు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎంపిసూచించారు.

నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వ పరంగా అన్ని చర్యలు చేపడుతున్నామని అన్నారు.

# యువతకు ఆదర్శంగా నిలుస్తున్న రమేష్ రాజా

## అబ్బుర పరిచే సాహస విన్యాసాలు, పట్టుదలతో వరుస విజయాలు

**జనోదయ, మందమర్రి జనవరి 5:** జీవితంలో ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకోవడానికి ఎన్ని అడ్డంకులు ఎదురైనా కృషి, పట్టుదలతో లక్ష్యాన్ని చేరుకొని నేటి యువతరానికి ఆదర్శంగా నిలిచాడు పట్టణానికి చెందిన తోట రమేష్ రాజా. పేదరికంతో ఇబ్బందులు పడుతున్న మొక్కవోని ఆత్మ విశ్వాసంతో, ఎలాంటి సహకారం లేకపోయినప్పటికీ ప్రసార మాధ్యమాల ద్వారా మార్షల్ ఆర్ట్స్ విద్యలో శిక్షణ పొంది, అబ్బురపరిచే విన్యాసాలతో ప్రజలను మంత్రముగ్ధులను చేస్తూ సాహస వీరుడుగా గుర్తింపు సంపాదించాడు. పట్టణంలోని 1వ జోన్ కు చెందిన సింగరేణి రిటైర్డ్ కార్మికుడు తోట వెంకటికమల దంపతుల కుమారుడు రమేష్ రాజా. చిన్నతనంలోనే మార్షల్ ఆర్ట్స్ విద్య పై మక్కువ తో, శిక్షణకు కుటుంబ పరిస్థితులు అనుకూలించక పోవడంతో కృషి పట్టుదలతో ప్రసార మాధ్యమాల్లో వచ్చే మార్షల్ ఆర్ట్స్



శిక్షణ కార్యక్రమాలు చూసి ఆత్మవిశ్వాసంతో సొంతంగా కఠోర సాధన చేసి అబ్బురపరిచే విన్యాసాలు ప్రదర్శిస్తూ, నిజమైన సాహస వీరుడిగా ప్రజల్లో గుర్తింపు సంపాదించాడు. మార్షల్ ఆర్ట్స్ విద్య గురించి అంతగా ప్రాచుర్యం లేని రోజుల్లోనే తను నేర్చుకున్న విద్య ద్వారా ఒళ్ళు గగుర్పొడిచే విన్యాసాలు ప్రదర్శించి పలువురి ప్రశంసలు అందుకున్నారు.అసౌకర్యాల మధ్యనే తన విన్యాసాలను ప్రదర్శిస్తూ అనేక బహుమతులు, ప్రశంసా పత్రాలు సంపాదించారు. జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి అనేక పోటీలలో పాల్గొని తన అద్భుత ప్రదర్శనతో బహుమతులు సాధించారు. పలు ప్రైవేటు



టెలివిజన్ ప్రసార కార్యక్రమాల్లో సాహసం చేయరా డింభకా,అసాధ్యులు, కిక్ ఉందా లాంటి కార్యక్రమా లలో సాహసోపేతమైన విన్యాసాలను ప్రదర్శించి వీక్షకుల మన్ననలతో పాటు అవార్డులను, రివార్డులను అందుకున్నారు. పేదరికం వెంటాడి నప్పటికీ పట్టుదలతో కఠోర సాధనతో ప్రపంచ గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో తనకంటూ ఓ స్థానం సంపాదించాలనే లక్ష్యం వైపు పయనిస్తున్నారు.

**అబ్బురపరిచే విన్యాసాలు ఆయన సొంతం**

పలు చలన చిత్రాలలో ప్రసార మైన సాహస విన్యాసాలను అనుకరించి ఆయనే సొంతం గా సాహస విన్యాసాలు ప్రదర్శిస్తూ నిజమైన స్టంట్ మాస్టర్ గా గుర్తింపు సంపాదించాడు. పవన్ కళ్యాణ్ సినిమాల్లో ప్రదర్శించి న చేతుల నుండి కార్లు పోనిచ్చుకోవడం తోపాటు ముంజేయి పై నుండి వ్యాన్లు, ట్రాక్టర్లను పోనిచ్చుకోవడం, చాతి పై నుండి వాహనాలు పోనిచ్చుకోవడం, పెద్ద పెద్ద బండరాళ్లు పగలకొట్టుకోవడం లాంటి ఒళ్ళు గగ్గురపరిచే విన్యాసాలను ఎలాంటి జంకు, బొంకు లేకుండా ప్రదర్శించి విమర్శకుల నుండి ప్రశంసలు అందుకున్నారు. తలతో ఐస్ గడ్డలను పగలకొట్టడం, చేతుల పై నుండి బస్సులు, లారీలు పోనిచ్చుకోవడం, చాతీ పైన 70 కిలోల బరువు గల బండరాళ్లను అవలీలగా పగలకొట్టు కోవడం లాంటి విన్యాసాలను చూసే ప్రేక్షకులే భయాందోళనలకు గురైనా, వారిచే ఔరా అనిపించు కున్నాడు. 2001వ సంవత్సరంలో పట్టణంలో జరిగిన ఒక కార్యక్రమంలో కాళ్ళ పైనుండి జీపులు, కార్లు పోనిచ్చుకొ శభాష్ అనిపించు కున్నాడు.

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పట్టణం లోని సింగరేణి హై స్కూల్ మైదానంలో తన అద్భుత విన్యాసాలను ప్రదర్శించి కోల్ బెల్ట్ రియల్ హీరో గా అవార్డు దక్కించుకున్నాడు. 2003 సంవత్సరంలో ప్రముఖ టీవీ ఛానల్ కు ఇచ్చిన ప్రదర్శనలో గాజు పెంకులపై చేతులు ఆ ఉంచి వాటిపై నుండి వాహనాలు పోనిచ్చి వీక్షకులను అబ్బుర పరిచాడు. మార్షల్ ఆర్ట్స్ లో బ్లాక్ బెల్ట్ సాధించి తన ప్రదర్శనలతో, కత్తి సాము, కర్ర సాము, నాన్ చాక్ విన్యాసాలతో వీక్షకులను మంత్రముగ్ధుల్ని చేయడమే కాకుండా తను నేర్చుకున్న విద్యను పలువురికి అందించాలనే సంకల్పంతో ఉచితంగా శిక్షణ అందిస్తున్నాడు. అరచేతితో మెట్లు ఎక్కడం, రైల్వే ట్రాక్ పై నడవడం, వాహనాల వెనకనుండి సురక్షితంగా జంప్ చేయడం, గంటల కొద్దీ కాలు పైకెత్తి ఒంటిచేత్తో నిలబడడం లాంటి అద్భుత విన్యాసాలతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తున్న రమేష్ రాజా విన్యాసాలు రాష్ట్ర వ్యాప్తంగా కోల్ బెల్ట్ ప్రాంతానికి పేరు తీసుకువ



చ్చి యువతకు మార్గదర్శకంగా నిలిచాడు.

**సాధించిన రికార్డులు:**

సాహసమే ఊపిరిగా కఠోర సాధనతో రేయింబవళ్లు కష్టపడుతూ సాహసవీరుడు గా గుర్తింపు పొందిన రమేష్ రాజా జిల్లా స్థాయి నుండి అంతర్జాతీయ స్థాయి వరకు గుర్తింపు పొందారు. తెలంగాణ రియల్ స్టంట్ మాస్టర్ గా ప్రపంచ హై రేంజ్ రికార్డును సొంతం చేసుకున్నాడు. అంతేకాకుండా తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్, తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్, వండర్ బుక్ రికార్డ్, ఇండియా రికార్డ్, ఇండియా టాలెంట్ రికార్డ్, జీనియస్ రికార్డ్, కరాటే కింగ్ రికార్డ్, అద్భుతం రికార్డ్, జాతీయ రికార్డ్ లాంటి పలు బుక్ ఆఫ్ రికార్డ్స్ లో తన స్థానాన్ని పొందు పరచుకున్నాడు. లిమ్కా



బుక్ ఆఫ్ రికార్డులో తన స్థానాన్ని నమోదు చేసేందుకు కరోనా కష్టకాలం అడ్డు రావడంతో కొంత వాయిదా పడింది. బ్రతుకు చిత్రాన్ని సాహసాల అంచున నిలబెట్టి,ఏ క్షణాన ఏ ప్రమాదానికి గురు అవుతామో తెలియని పరిస్థితుల్లో, సాధించాలనే తపనతో, నిరంతరం పోరాటం కొన సాగిస్తున్న రమేష్ రాజ కు ఆర్థిక ఇబ్బందులు అడ్డుకట్ట గా మారాయి.

**ప్రోత్సహిస్తే కిక్ బాక్సింగ్ అకాడమీ స్థాపిస్తా:**

అద్భుత విన్యాసాలతో సాహస వీరునిగా గుర్తింపు పొందినప్పటికి ఆర్థిక పరిస్థితుల మూలంగా అనేక అవకాశాలు కోల్పోయాను. ప్రభుత్వం స్పందించి తగిన ప్రోత్సాహం అందిస్తే ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకుంటానని ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుండి తగిన సహకారం అందిస్తే కిక్ బాక్సింగ్ అకాడమీ స్థాపించి పలువురికి ఇష్టంగా సాహస విన్యాసాలలో శిక్షణ ఇస్తానని స్పష్టం చేశారు. ప్రభుత్వం, ప్రభుత్వ, ప్రజా ప్రతినిధులు, దాతలు, స్వచ్ఛంద సంస్థలు అతని కృషికి సహకారం అందిస్తే గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ లో స్థానం సంపాదించి, మార్షల్ ఆర్ట్స్ విద్యలో తన కంటూ మెరుగైన గుర్తింపు సాధించగలిగి, పట్టణ, కోల్ బెల్ట్ ఖ్యాతిని ప్రపంచం నలుమూలల విస్తరిస్తానని ఆత్మ విశ్వాసం వ్యక్తం చేశారు.

# సింగరేణి ఓసిపి5లో ఏఐటీయూసీ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

**జనోదయ, గోదావరిఖని, డిసెంబర్ 05:** సింగరేణి ఆర్జీఏరియా లోని ఓసిపి5లో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ప్రాజెక్టు కమిటీ ఆధ్వర్యంలో 2026 నూతన ఆంగ్ల సంవత్సర క్యాలెండర్ లను సోమవారం ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐటియుసి ప్రాజెక్టు కార్యదర్శి గుర్రం ప్రభుదాస్ మాట్లాడుతూ.. ప్రాజెక్టు లో పని చేస్తున్న అధికారుల కు, కార్మికుల కు, ఉద్యోగులకు, కార్మిక సంఘాల నాయకులకు, కార్యకర్తలకు, వారి కుటుంబ సభ్యులందరికీ నూతన ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి ఉపాధ్యక్షులు మాదన మహేష్ కార్మిక సోదరీ సోదరులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ సింగరేణి సంస్థ పరిరక్షణ కోసం కార్మికుల హక్కుల సాధన కోసం వారి సంక్షేమం కోసం ఏఐటియుసి నిరంతరం కృషి చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్ ల వల్ల కార్మిక వర్గంకు తీవ్ర నష్టం జరుగుతుందని, కేంద్రం వల్ల సింగరేణి కి బొగ్గు గనులు రాక ఉన్న గనులు మూత పడుతున్నాయని, కొత్త గనులు కోసం ఏఐటియుసి ఉద్యమాలు చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి ప్రాజెక్టు నాయకులు చీకటి అంజయ్య, చంద తిరుపతి, భక్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**జానోదయ మంచిర్యాల జనవరి 5, 2026** : ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి.చంద్రయ్య, డిప్యూటీ ట్రైనీ కలెక్టర్ మహమ్మద్ విలాయత్ అలీ లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. మంచిర్యాల పట్టణం రామ్ నగర్ కు చెందిన కోమాకుల పోచమ్మ తనకు లక్షెట్టిపేట మండలం ఉత్కూర్ చౌరస్తా శివారులో గల భూమిని కొందరు అక్రమంగా తీసుకున్నారని, ఈ విషయమై విచారించి తనకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. లక్షెట్టిపేట మండలం వెంకట్రావుపేట గ్రామానికి చెందిన తిప్పని అనిత తాను రిజిస్ట్రేషన్ దస్తావేజు ద్వారా కొనుగోలు చేసిన భూమిని తన పేరిట రెవెన్యూ రికార్డులలో జమాబంది చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. జన్నారం మండలం చింతలపల్లి గ్రామానికి చెందిన నాయిని లక్ష్మి గ్రామపంచాయతీ రోడ్డు నుండి తన ఇంటికి రాకపోకలు సాగించేందుకు గల త్రోవను ఉద్దేశం పూర్వకంగా మూసివేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారని, తనకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బెల్లంపల్లి పట్టణంలోని వార్డు నెంబర్ 32కు చెందిన బాల కవిత తాను ఇందిరమ్మ ఇంటి కొరకు దరఖాస్తు చేసుకోగా ప్రభుత్వ ఉద్యోగులుగా చూపిస్తుందని, తనకు ఉద్యోగం లేదని, వివరాలను సవరించి తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. మంచిర్యాల పట్టణంలోని పాత గర్మిళ్ళ ప్రాంతానికి చెందిన అందే లక్ష్మి తనకు భూమి ఉందని ఇల్లు నిర్మించుకునేందుకు ఇందిరమ్మ ఇంటి పథకం వర్తింపజేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణం ఎన్.టి.ఆర్. నగర్ కు చెందిన చింతల లక్ష్మి తన భర్త చనిపోయారని, ఎల్లంపల్లి బ్యాక్ వాటర్ ప్రమాదంలో తన కుమారుడు సైతం మృతి చెందినందున, తనకు ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. హైటెక్ సిటీ వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మంచిర్యాల పట్టణంలోని 29వ వార్డు లో విద్యుత్ దీపాలు, ఓపెన్ జిమ్ పరికరాల మరమ్మత్తులు, గ్రీన్ మ్యాట్ ఏర్పాటు, మూత్రశాలలు ఇతర సౌకర్యాలు కల్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.



## విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య

- **జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ పసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్ .**

**జనవరి 5, 2026: జనోదయ మంచిర్యాల జిల్లా ప్రతినిధి** : రామగుండం కార్పొరేషన్ ఏరియా స్వర్ణకార సంఘ కళ్యాణ మండప నిర్మాణానికి సహకరిస్తానని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ అన్నారు. శుక్రవారం స్థానిక వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆలయ ప్రాంగణంలో ఎమ్మెల్యే దంపతులకు స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సత్కార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బెంగాలీ వర్కర్ల నుండి స్థానిక స్వర్ణకారులకు ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించడానికి కృషి చేస్తానని అలాగే స్వర్ణకార కుటుంబాల వివాహానికి గాను కళ్యాణ మండప నిర్మాణానికి ఆర్థిక చేయుత అందిస్తానని అలాగే పుస్తే, మట్టలను కేవలం స్వర్ణకారులు మాత్రమే తయారు చేసి విక్రయించేలా ప్రభుత్వం తరఫున జీవో జారీ చేయడానికి గాను అసెంబ్లీలో మాట్లాడతానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రామగుండం కార్పొరేషన్ ఏరియా స్వర్ణకార సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొండపర్తి నరహరి, కట్ట నగేష్ కుమార్, పెద్దపల్లి జిల్లా స్వర్ణకార సంఘం అధ్యక్షులు రంగు శ్రీనివాస్, నాయకులు శ్రీరామోజు సత్యనారాయణ, గుగ్గిల రవీంద్రా చారి, కట్ట శ్రీధరచారి, శ్రీరామోజు జగన్, గాలిపెల్లి రమేష్, విజయగిరి సదానందం, ప్రసాద్, బొజ్జ పురుషోత్తం, కందుకూరి అశోక్, శ్రీరామోజు ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.



## తానూర్ లో ఉచిత వైద్య శిబిరం

- **శ్రీ వెంకటేశ్వర మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ బైంసా వారి ఆధ్వర్యంలో.**



**జనోదయ,బైంసా,డిసెంబర్ 26:** జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ పరిధిలోని సంక్షేమ వసతిగృహాలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించే దిశగా అధికారులు కృషి చేయాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్ అన్నారు. సోమవారం వసతి గృహాల సంక్షేమ అధికారులతో జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖ ఉపసంచాలకులు మాట్లాడుతూ షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ పరిధిలో కొనసాగుతున్న సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులకు అవసరమైన పూర్తి సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్య అందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాల నమోదులు నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని, వసతి గృహాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తత చర్యలు చేపట్టాలని తెలిపారు. అనంతరం షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ పరిధిలోని వసతి గృహాలలో విద్య అభ్యసిస్తున్న ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ విద్యార్థులు తయారుచేసిన 2026 నూతన సంవత్సరం గ్రీటింగ్ కార్డులను జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవనం సముదాయంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య, అన్ని శాఖల అధికారులకు అందించారు.

ఈ కార్యక్రమంలో ఎ ఎస్ డబ్ల్యూ ఓ ధర్మానంద్ గౌడ్, డి.చందన, కుమారస్వామి, వసతి గృహ సంక్షేమ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నూతనముగా ఎన్నుకోబడిన గౌరవ సర్పంచ్ గార్లకు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సన్మాన కార్యక్రమం

**జనోదయ జైపూర్ జనవరి 5:** మంచిర్యాల్ జిల్లా జైపూర్ మండల కేంద్రంలో ఎంపిడిఓ శ్రీ జి.సత్యనారాయణ గారు మాట్లాడుతూ, నూతన సర్పంచులకు శుభాకాంక్షలు తెలియజేసినారు. సర్పంచులు మరియు అధికారులు సమన్వయంతో పని చేస్తూ గ్రామాలలో నెలకొన్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని, అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకొని వెళ్లాలని తెలియజేసినారు. అనంతరం, జైపూర్ మండలంలోని పలు అభివృద్ధి పనుల గురించి సర్పంచులకు వివరించారు. ఇట్టి కార్యక్రమంనకు అన్ని గ్రామ పంచాయతీల సర్పంచులు హాజరై అందరికీ పరిచయం చేసుకోవడం జరిగింది. తర్వాత, నూతన సర్పంచులను శాలువాలతో సన్మానించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో గౌరవ ఎంపిడిఓ శ్రీ జి.సత్యనారాయణ గారు, గౌరవ తహశీల్దార్ శ్రీమతి వనజ రెడ్డి గారు, గౌరవ డి ఈ ఏ. విద్యాసాగర్ గారు, గౌరవ ఎంపీఓ శ్రీ శ్రీపతి బాపు రావు గారు, గౌరవ ఏ ఈ పి ఆర్ బి. రాజ్ కుమార్ గారు, కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీమతి భాగ్యలక్ష్మి, వివిధ గ్రామ పంచాయతీల సర్పంచులు శ్రీమతి వేముల స్రవంతి, శ్రీ జి. శ్రీనివాస్ రెడ్డి, శ్రీ ఎండి. ఫయాజ్, శ్రీమతి కే. వినోద, శ్రీ కే.మనోహర్, శ్రీ టి.తిరుపతి, శ్రీమతి ఏ.స్రవంతి, శ్రీ ఆర్. రామన్న, శ్రీమతి వి.సుధ, శ్రీ పి రాజశేఖర్, శ్రీమతి జే.సరస్వతి, శ్రీ టి.అంజన్ గౌడ్, శ్రీ బి.వెంకటేష్, శ్రీమతి డి.స్వప్న, శ్రీమతి జే. లక్ష్మి గారలు, పంచాయితీ కార్యదర్శులు, ఈ జి ఎస్ సిబ్బంది, కార్యాలయ సిబ్బంది, పాత్రికేయులు, గ్రామ ప్రజలు హాజరైనారు.



## ఘనంగా మురళి మెమోరియల్ క్రికెట్ అకాడమీ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు

**జనోదయ,బెల్లంపల్లి ,జనవరి 5** బెల్లంపల్లిలోని మురళి మెమోరియల్ క్రికెట్ అకాడమీ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం సాయంత్రం రైల్వే స్టేషన్ వద్ద గల అకాడమీ ప్రాంగణంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అకాడమీ నిర్వాహకులు తమ అకాడమీకి సంవత్సర కాలంగా సహాయ సహకారాలు అందజేసిన పలువురికి , క్రికెట్ పాఠాలు నేర్చుకుంటున్న చిన్నారుల తల్లిదండ్రులకు శాలువాలు కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా అకాడమీ నిర్వాహకులు అల్లం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎస్ జి ఎఫ్ లో అండర్ 14 అండర్ 17 అండర్ 19 విభాగంలో తమ వద్ద క్రికెట్ నేర్చుకుంటున్నా విద్యార్థులు రాష్ట్రస్థాయి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనారని, అలాగే హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలో కూడా ఎంపికైనారని ఆయన తెలిపారు. బెల్లంపల్లి మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్,కెరీర్ గ్రూప్ చైర్మన్ రాజేష్‌గౌడ్, ఎస్ జి ఎఫ్ కాలేజ్ పిడి బాబురావు, ఎస్ జి ఎఫ్ స్కూల్స్ ఆర్గనైజర్ గోపాల్ ఒకేషనల్ గ్రూప్ ప్రిన్సిపాల్ రాజేష్, కోచ్ గౌతం, న్యాయవాది నల్లుల సంగీత, తదితరులు ఈ వేడుకలో పాల్గొన్నారు.



## బొగ్గు ఉత్పత్తిలో నాణ్యతా ప్రమాణాలకు ప్రాధాన్యత నివ్వాలి

**జనోదయ, మందమర్రి జనవరి 5:** సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియాల్లో బొగ్గు ఉత్పత్తిలో నాణ్యతా ప్రమాణాలకు అత్యధిక ప్రాధాన్యత నివ్వాలని, తగిన గ్రేడ్ బొగ్గు సరఫరాకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని సంస్థ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) కె. వెంకటేశ్వర్లు అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లను సూచించారు. కొత్తగూడెం కార్పొరేట్ కార్యాలయం నుండి ఏరియాల జీఎం, క్వాలిటీ అధికారులతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత బొగ్గు మార్కెట్ లో నాణ్యతకు అధిక ప్రాధాన్యత ఉందని, నాణ్యతా ప్రమాణాలు లేని బొగ్గును వినియోగదారులు స్వీకరించడం లేదని, దీనిని దృష్టిలో పెట్టుకొని బొగ్గు ఉత్పత్తి నుండి మొదలు కొని వినియోగదారులకు పంపించే లోడింగ్ ప్రాంతం వరకు విధులు నిర్వహిస్తున్న అధికారులు, ఉద్యోగులు

ప్రతి ఒక్కరూ నాణ్యతపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఆయన ఆదేశించారు.

నాణ్యత ప్రమాణాల పాటింపు కు వివిధ ఏరియాల్లో తీసుకుంటున్న చర్యలపై అధికారులతో సమీక్షించడంతో పాటు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధికారులకు వివరించారు. ఈ సమావేశం లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూవ్ మెంట్) బి వెంకన్న, జనరల్ మేనేజర్ (సీపీపీ) ఎ మనోహర్, జనరల్ మేనేజర్ (కోఆర్డినేషన్ మార్కెటింగ్) టి శ్రీనివాస్, తో పాటు అన్ని ఏరియాల జనరల్ మేనేజర్లు పాల్గొన్నారు.






## పేకాట ఆడుతున్న ఐదుగురు అరెస్ట్ – రూ.26,183 నగదు స్వాధీనం

**జనోదయ మెదక్ జిల్లా 05:** మెదక్ జిల్లా పాపన్నపేట మండలం లింగాయపల్లి గ్రామంలో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్,పాపన్నపేట పోలీస్ సిబ్బంది కలిసి ఆకస్మిక దాడి నిర్వహించారు.ఈ దాడిలో ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేయడం జరిగిందని పోలీసులు తెలిపారు.దాదిగారి కృష్ణగౌడ్,పుట్టి బాగయ్య,వగ్గు యాదయ్య, మెగావత్ కిషన్,నీరుడి లక్ష్మణ్ లను అదుపులోకి తీసుకున్నారు.అదేవిధంగా గుండమ్మ సాయిలు,పుట్టి బండాల సత్యనారాయణ, బెస్త వెంకటేశం,బుద్ధి సాయమ్మ, కర్రె సాయమ్మ సాయిలు,కోలా ధన్సింగ్ లు పరారీ అయ్యారు.జూదం ఆడుతున్న ప్రదేశం నుండి మొత్తం రూ.26,183/ నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.పట్టుబడిన నిందితులను సంబంధిత పోలీస్ స్టేషన్‌కు తరలించి,వారి పై చట్టపరమైన చర్యలు చేపట్టడం జరుగుతున్నదని తెలిపారు.పరారైన నిందితులను త్వరలోనే పట్టుకుంటామని పేర్కొన్నారు.






## సహజ పద్ధతి వ్యవసాయానికి ప్రోత్సాహం రైతులకు వ్యవసాయ అధికారుల శిక్షణ

**జనోదయ మంచిర్యాల జిల్లా ప్రతినిధి 05:** మంచిర్యాల జిల్లా జైపూర్ మండల్ పౌనూర్ రైతులను ప్రకృతి ఆధారిత వ్యవసాయానికి వ్యవసాయ అధికారులు ప్రోత్సహిస్తున్నారు. సోమవారం సహజ పద్ధతుల్లో వ్యవసాయం చేయాలని రైతులకు శిక్షణ చేపట్టి అవగాహన కల్పించారు. రవి సీజన్లో 100 నుండి 125 ఎకరాలలో రసాయనిక ఎరువులు పిచికారి మందులు వాడకుండా, ప్రకృతి వ్యవసాయం చేయాలని తెలిపారు. వేప నూనె పంచామృతం తయారీ విధానం కోసం సహజ వనరులను ఉపయోగించే పద్ధతులను వివరించారు. ప్రధానంగా అచ్చిరోట సాగు చేయడం వలన భూమి సారవంతంగా ఉంటుందని తెలిపారు. సహజ పద్ధతి వ్యవసాయం అవలంబించి అనుకున్న దిగుబడిని సాధించవచ్చునని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చెన్నూర్ ఎడిఏ బానోత్ ప్రకాష్, జిల్లా కార్యాలయం ఏడిఏ గోపి, వ్యవసాయ అధికారి శివలీల పాల్గొన్నారు. అదే క్రమంగా కిష్టాపూర్ శెట్టిపల్లి పౌనూరులలో ఆగ్రోస్ డీసీఎంఎస్ కేంద్రాలను తనిఖీ చేశారు. రికార్డులు ఎప్పటికప్పుడు స్పష్టంగా ఉండాలని డీలర్లకు సూచించారు. క్రయ విక్రయాలు జరిగినప్పుడు రసీదులు ఇవ్వాలన్నారు. ఎరువుల నిల్వలను రిజిస్టర్లో నమోదు చేయాలని ఆదేశించారు.

